www.jananinadam.com

RNI NO:TGTEL/25/A0870

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

జిల్లా వారిగా విలేకర్లు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ , అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జననినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460

మంగళవారం 08-09 - 2026
సంపుటి : 2 సంచిక : 129

ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్
Editor: JADAV ROHIDAS

పేజీలు : 04
వెల: రూ.2.00


Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

**తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం**

**ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు**

**రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 07:** తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం

# తెలంగాణలో కోటి ఓట్లు తొలగించేందుకు కుట్ర

**కొడంగల్లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన**

**బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ**

**2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం**

**పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆ**

**లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7:** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని

## భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర...


**దేశాన్ని ముందుకు నడిపిస్తున్నది వారే**

**భారత చరిత్రలో మహిళలే అసలైన మార్పునకు మార్గదర్శకులన్న ఓం బిర్లా**

**స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు మహిళల పాత్ర కీలకమని వెల్లడి**

**నేటి మహిళలు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్నారని వ్యాఖ్య**

**మహిళా శాసనసభ్యుల కోసం జాతీయ మహిళా కమిషన్ ప్రత్యేక వర్క్ షాప్**



భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎల్లప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలుస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోక్సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. వారి నాయకత్వ పటిమను మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నేడు ఫరీదాబాద్లో జాతీయ మహిళా కమిషన్



## కమ్యూనిస్టులు లేవనెత్తిన ప్రతీ సమస్యను కాంగ్రెస్ పరిష్కరించింది

**సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభతో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ 07:** కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. రేవంత్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతం నుంచి జాతీయ స్థాయి వరకు వెళ్లి రైతుల కోసం తన జీవితాన్ని ధారపోసిన నాయకుడు సారంపల్లి మరణం రైతాంగానికి తీరని లోటని అన్నారు. సమస్యపై అవగాహన, సంస్కారవంతంగా అంశాలను లేవనెత్తడంలో సారంపల్లికి సాటి లేరు కౌలు రైతుల సమస్య, పంటలు గిట్టుబాటు ధర కోసం ఆయన ఎంతో పోరాడారు. భూమి సారం నుంచి పంట తీసేవరకు సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్న ఎన్ సైక్లోపీడియా సారంపల్లి. ఆయన రాసిన పుస్తకాలు, లేవనెత్తిన




## ఫీరీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని టీఆర్ఎస్ కవిత ర్యాలీ

**హన్మకొండ07:** ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి హన్మకొండ కలెక్టరేట్ వరకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత విద్యార్థులతో కలిసి ర్యాలీ చేసారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారుకవిత మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ ముఖ్యమంత్రి ఒకసారి ఇంటర్మీడియట్ విద్యా విధానం తీసేస్తానని అంటారు.. ఇంకోసారి పాలిటెక్నిక్ ను స్కిల్ యూనివర్సిటీలో విలీనం అంటారు. విద్యార్థుల ఫీ రీయింబర్స్మెంట్ చెల్లించక పోవడంతో లక్షలాది మంది డిగ్రీలు, ప్రొఫెషనల్ డిగ్రీలు పూర్తి చేసినా సర్టిఫికెట్లు అందక ఉద్యోగాలు పొందలేక పోతున్నారు. ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించే వరకు ఈ ప్రభుత్వంపై పోరాడుతామని అన్నారు.

# అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత..

**అరెస్టుకు యత్నించగా కిందపడిపోయిన హరీష్ రావు, కేటీఆర్కు గాయాలు!**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7:** శాసనసభ సమావేశాల వేళ అసెంబ్లీ ప్రాంగణం వద్ద నేటి ఉదయం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడంపై గులాబీ శ్రేణులు భగ్గుమన్నాయి. పోలీసుల వ్యవహార శైలికి, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై జరిగిన భౌతిక దాడులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని బీఆర్ఎస్ అధిష్టానం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహం, అప్రజాస్వామిక వైఖరిపై బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో

## మహిళా ఎమ్మెల్యే చీర లాగినవాళ్లను వదిలిపెట్టం...

**బీఆర్ఎస్ సభ్యులు సభలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రతో రేవంత్ ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు**

**శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్య**

**శాసనసభ కౌరవసభలా మారిందని విమర్శ**



**హైదరాబాద్07:** తెలంగాణ శాసనసభ సమావేశాల వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్కు

# ఇది దుశ్శాసన సభ...

**మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా... : కేటీఆర్**

**శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్**

**తాము ఎలాంటి అన్ పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి**

**ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7:** ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో

## దుద్దిళ్ల శ్రీపాద రావు సెంట్రల్ హాల్ ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ 07:** శాసనసభ ప్రాంగణంలో నూతనంగా రూపుదిద్దుకున్న సెంట్రల్ హాల్ను సభా నాయకుడు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు పేరుతో సెంట్రల్ హాల్గా నామకరణం చేసిన ఈ ప్రాంగణ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి తో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రిశ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు మంత్రులు, ప్రభుత్వ విప్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మాజీ శాసనసభ స్పీకర్ శ్రీపాద రావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి గౌరవ సభ్యులతో కలిసి బ్రేక్ఫాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు లేవనెత్తిన ప్రతీ సమస్యను కాంగ్రెస్ పరిష్కరించింది

మొదటిపేజీ తరువాయి...

అంశాలను దృష్టిలో పెట్టుకుని రైతాంగ సమస్యలను మా ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. సారంపల్లి మల్లారెడ్డి అంటే వ్యక్తిగతంగా నాకు ఎంతో అభిమానం. భూమిలేని నిరుపేదలకు కనీస కూలీ ఉండాలని కమ్యూనిస్టులు కొట్లాడారు. కనీస వేతన చట్టం తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ . దున్నేవాడికి భూమికోసం కమ్యూనిస్టులు పోరాడారు . అసైన్డ్ భూములను 24 లక్షల 56 వేల ఎకరాలు కాంగ్రెస్ ప్రభుత్వం పంచింది . 10 లక్షల ఎకరాలు ఆదివాసీల చేతుల్లో ఉన్నాయి . ఇది కమ్యూస్టుల పోరాటానికి .. కాంగ్రెస్ పరిష్కారం . ఉపాధి హామీ చట్టం ద్వారా పని కల్పించింది కాంగ్రెస్ పార్టీ . ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ . కమ్యూనిస్టులు లేవనెత్తిన ప్రతీ సమస్యను కాంగ్రెస్ పరిష్కరించింది . ఎన్నికల్లో కలిసినా కలవకపోయినా.. కమ్యూనిస్టుల పోరాటం కాంగ్రెస్ పార్టీకి ఉపయోగపడింది . మనమంతా కలసి దేశంలో మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది . ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో గెలవలేనప్పుడు కొత్త కొత్త విధానాలను అవలంబిస్తున్నారు . ఎస్ఐఆర్ పేరుతో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను టార్గెట్ చేసుకున్నారు . తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారు . బెంగాల్ లో చేసినట్లే తెలంగాణలో చేస్తామని బీజేపీ నాయకులు బరితెగించి మాట్లాడుతున్నారు . గత ఎన్నికల్లో బూత్ ల వారీగా బీజేపీ



వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీలను పెట్టి సర్వేలు చేయించి క్రమపద్ధతిలో ఓట్లు తొలగిస్తున్నారు . ఎన్నికల కమిషన్ ను కూడా బీజేపీ రాజకీయాలకు వాడుకుంటోంది . ఎస్ఐఆర్ పై ప్రధాన ప్రతిపక్షం ఏ ఒక్క మాట మాట్లాడటంలేదు . దీని వెనక వారికున్న అవగాహనను కమ్యూనిస్టులు అర్థం చేసుకోవాలి . ఎన్నికలు వేరు.. పేద ప్రజల ప్రాథమిక హక్కులు వేరు . ఇన్నాళ్ళుగా పేదల హక్కుల కోసం కమ్యూనిస్టులు కొట్లాడుతున్నారు . ఎర్రజెండా కనిపిస్తే పేదవాడికి నొక భరోసా . దేశానికి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి నరేంద్రమోదీ . మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు . పేద ప్రజల ఓటు హక్కును కమ్యూనిస్టులు కాపాడాలి . కేబినెట్ సహచరులతో చర్చించి.. సారంపల్లి మల్లారెడ్డి గారి పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా చేస్తామని అన్నారు.

## తెలంగాణలో కోటి ఓట్లు తొలగించేందుకు కుట్ర

మొదటిపేజీ తరువాయి...



తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు.బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు.కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

## మహిళా ఎమ్మెల్యే చీర లాగినవాళ్లను వదిలిపెట్టం...

మొదటిపేజీ తరువాయి...

వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్రవు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశిరెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్రవు స్పష్టం చేశారు.

## భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర...

మొదటిపేజీ తరువాయి...

(ఎన్సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో మహిళా శాసనసభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల వర్క్షాప్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ.. "భారతదేశ చరిత్రలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు, రాజ్యాంగ రూపకల్పన నుంచి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం వరకు వారి పాత్ర ఎంతో విశిష్టమైనది" అని కొనియాడారు. దేశం సంస్థాగత నిర్మాణం, ఆధ్యాత్మిక, మత, సాంస్కృతిక సంప్రదాయాలలో మహిళల సహకారం, గౌరవం, నాయకత్వం ఎన్నటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు కేవలం మార్పునకు సంకేతంగా నిలవడమే కాకుండా, వివిధ రంగాలలో అపూర్వమైన విజయాలు సాధిస్తూ, తమ నాయకత్వ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని ఓం బిర్లా అన్నారు. వారిలో ఉన్న సహజసిద్ధమైన నాయకత్వ లక్షణాలను గుర్తించి, వాటికి మరింత పదును పెట్టేందుకు తగిన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. "మహిళలకు సాధికారత కల్పించడం, వారి కోసం ఇలాంటి సామర్థ్య పెంపుదల వర్క్షాప్లు నిర్వహించడం రెండూ అత్యంత ముఖ్యమైన అంశాలు" అని ఆయన నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా, మహిళా శాసనసభ్యుల కోసం ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు జాతీయ మహిళా కమిషన్ ఛైర్పర్సన్ విజయ రాహత్కర్ను ఓం బిర్లా ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళా నాయకులలో కొత్త స్ఫూర్తిని నింపుతాయని, ప్రజాసేవలో వారిని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వర్క్షాప్ ద్వారా మహిళా ప్రజాప్రతినిధులు కొత్త విషయాలు నేర్చుకుని, తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఇది దుశ్శాసన సభ...

మొదటిపేజీ తరువాయి...



వైఎస్సార్, కిరణ్కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ ఛైర్పర్సన్గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

## తాతా మధును బర్తరఫ్ చేయాలి

### స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు

### కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఏలేటి



**హైదరాబాద్, సెప్టెంబర్ 07:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఎలేటి మహేశ్వర్ రెడ్డి ఉన్న సీకర్పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు.ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా.... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత..

మొదటిపేజీ తరువాయి...

పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దారుణంగా ప్రవర్తించారని అన్నారు. మంత్రిగా సేవలు అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. మేం సభలో లేని సమయంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరపడం సరికాదన్నారు. తాము చేసేది తప్పు కాదంటే, ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని భావిస్తే బీఆర్ఎస్ సభ్యులు సభకు వచ్చినప్పుడు చర్చ జరపాలని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తామన్న భయంతో మేం లేని సమయం చూసి సభలో చర్చిస్తున్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కనుక మేం సభకు వచ్చినప్పుడు కీలకమైన నిషేధిత భూముల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు. పోలీసుల తోపులాటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి కిందపడిపోయారు. తమను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద హరీష్ రావు తన చొక్కా విప్పేశారు. నల్ల టీషర్టుతో లోపలికి అనుమతించకపోవడంతో హరీష్ రావు బనియన్తో నిరసన తెలుపగా, ఆయనతో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్కు తరలించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు. మరోవైపు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీకి వెళుతున్న సమయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడంతో ఆమె కన్నీళ్లు పెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అని పోలీసుల తీరుపై తీవ్ర




నిరసన వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా అసెంబ్లీ గేటు వద్ద పోలీసుల అక్రమ అరెస్టులు, దాడుల ఘటనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది.నా చీర లాగారుతెలంగాణ శాసనసభ ప్రారంభానికి ముందే వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారనే విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా గన్పార్క్ నుంచి అసెంబ్లీ వైపు నల్ల దుస్తులతో బయలుదేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు.ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు అవమానకరంగా ప్రవర్తించి, ఆమె చీర పట్టుకుని లాగారని ఆరోపిస్తూ గులాబీ నేతలు తీవ్ర నిరసన తెలిపారు. మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా పోలీసులు చీర లాగి మరి, దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్సాహసం చేసిన పోలీసులు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకే ఒక మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా సభ సాక్షిగా సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి అవమానించారని, పోలీసుల ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇది క్షమించరాని నేరమని, యావత్ తెలంగాణ అక్కాచెల్లెళ్లపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. బాధ్యులైన పోలీసులపై



కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తారన్న భయంతో ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల్ని అసెంబ్లీకి రానివ్వకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. పోలీసుల వైఖరిని, బలవంతపు అరెస్టులను నిరసిస్తూ అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు నాయకులు షర్టులు విప్పేసి నిరసన తెలిపేందుకు ప్రయత్నించడంతో వాతావరణం మరింత వేడెక్కగా.. హరీష్ రావు, కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసు వాహనాల్లో అక్కడి నుంచి తరలించారు.తెలంగాణ శాసనసభ వద్ద సోమవారం ఉదయం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యాలు, హామీలపై నిలదీస్తారనే భయంతో నల్ల చొక్కాలు ధరించిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకుని కేటీఆర్, హరీశ్ రావు, లక్ష్మారెడ్డిలను బలవంతంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ తోపులాటలో హరీశ్ రావు, జగదీష్ రెడ్డి కిందపడిపోగా, కేటీఆర్కు గాయాలయ్యాయి. ప్రతిపక్షం లేని సభను నడపాలనే దుర్మార్గమైన ఆలోచనతోనే రేవంత్ ప్రభుత్వం ఈ అక్రమ అరెస్టులు, భౌతిక దాడులకు దిగిందని బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్న పోలీసుల తీరుపై గులాబీ నేతలు మండిపడుతున్నారు.

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

మొదటిపేజీ తరువాయి...



చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

### ఆలయ కమిటీ చైర్మన్ గా బర్ల శ్రీనివాస్.

కమాన్ పూర్ 07: రామగిరి మండలంలద్నాపూర్ గ్రామంలోని స్వయంభుగా వెలసిన ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీ గోదా రంగనాయక మరియు దాసాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ గా బర్ల శ్రీనివాస్ ని ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఎన్నుకోవడం జరిగింది. తనపై నమ్మకంతో తనకి అవకాశం ఇచ్చిన ఆలయ కమిటీ వారికి లద్నాపూర్ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆలయ అభివృద్ధికి ఆలయ సౌకర్యాలను దేవాలయంలోని ప్రతి సంవత్సరం జరిగే ఉత్సవాలను నూతన కమిటీ సభ్యులతో గ్రామస్తులతో ఘనంగా నిర్వహిస్తామని ఈ రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి మిగతా కమిటీని ఎన్నుకోవడం జరుగుతుంది అని తెలియజేశారు.

జననినాదం
మంగళవారం 08 సెప్టెంబరు 2026

# ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 07:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జైనూర్ మండలం ఊషేగం గ్రామానికి చెందిన జయ కళాబాయి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం కోయవాగుకు చెందిన కాంపెల్లి అరుణ ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన జూపాక పోచం తన పేరిట ఉన్న పట్టా భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. చింతలమానేపల్లి మండలం బూరేపల్లి గ్రామానికి చెందిన జాడి భగవాన్ తన పట్టా భూమి వేరొకరి పేరుతో నమోదైందని, పేరును సవరించి తన పేరిట నమోదు చేసి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్‌కు చెందిన నగోషా యమునబాయి వితంతు పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన గుండేటి స్వరూప, జైనూర్ మండలం ఊషేగాం గ్రామానికి చెందిన కోవ కమలాబాయి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

## మండప నిర్వాహకులతో సమీక్ష ఎస్పీ నితికా పంత్




**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 07:** గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలు, సంప్రదాయాలు, సమైక్యతతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆసిఫాబాద్ ఎస్పీ నితికా పంత్ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో సోమవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో సమగ్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, భక్తులు, ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. మండపాల వద్ద 24 గంటలూ వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, మండప నిర్మాణానికి నాణ్యమైన, మన్నికైన సామగ్రినే వినియోగించాలని తెలిపారు. విద్యుత్ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నాణ్యమైన వైర్లు, విద్యుత్ పరికరాలను మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలకు అనుగుణంగానే డీజే, సౌండ్ సిస్టమ్ వినియోగించాలని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల తర్వాత మైక్, సౌండ్ సిస్టమ్, డీజేలను వినియోగించరాదని పేర్కొన్నారు. మండపాల వద్ద టపాసులు, జూదం, లక్కీ డ్రాలు, బలవంతపు చందాలు,ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావివ్వరాదన్నారు. మద్యం సేవించి ఎవరూ మండపాల వద్దకు రాకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు నీరు, ఇసుక తదితర భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం కనిపించిన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందించాలని కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించి జిల్లాలో స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దిన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, గణేష్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# నోటీసుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 07:** ఎస్ఐఆర్ లో భాగంగా నోటీసుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు , ఎ.ఈ.ఆర్.ఓ లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా నో మ్యాపింగ్, అనామోలీస్ జాబితాకు సంబంధించిన ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని, నోటీసుల జారీ అనంతరం భారత ఎన్నికల సంఘం ద్వారా పేర్కొనబడిన డాక్యుమెంట్ల ద్వారా పరిశీలన చేసి ప్రక్రియని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత ఈ.ఆర్.ఓ. లు కార్యాచరణ ప్రకారం హియరింగ్ ఏర్పాటుచేసి సరైన డాక్యుమెంట్లను మాత్రమే పోర్టల్ లో నమోదు చేసేలా కృషి చేయాలని, జిల్లా ఎన్నికల అధికారులు తమ లాగిన్ లో త్వరగా క్లియర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ సంబంధిత హెల్ప్ డెస్క్ లను జిల్లా స్థాయిలో, ఈ.ఆర్.ఓ. కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని, బూత్ స్థాయి అధికారులు నోటీసులు అందించిన వెంటనే సమర్పించవలసిన డాక్యుమెంట్లపై ఓటర్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 70 శాతం నోటీసులు అందించడం జరిగిందని, మిగిలిన నోటీసులు కూడా త్వరలోనే పూర్తిగా అందిస్తామని తెలిపారు. హియరింగ్ కార్యాచరణ ప్రకారం నిర్వహించడం జరుగుతుందని, ఓటర్లు సరైన డాక్యుమెంట్లు సమర్పించేలా వారికి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. పెండింగ్ ఉన్న నో మ్యాపింగ్, అనామోలీస్ సంబంధిత ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నేతల ముందస్తు అరెస్టు

**జననినాదం,సిర్పూర్(యు) 07:** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమం నేపథ్యంలో సిర్పూర్(యు) మండలంలో బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీజేపీ నాయకులు గేడం శంబు, ఆత్రం సుధాకర్, కనక జూగాది రావు, అనిల్, దత్తులను ఏఎస్ఐ గంగారం ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'చలో అసెంబ్లీ'కి వెళ్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వారిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# అడవి పందుల దాడి.. యువకుడికి గాయాలు

**జననినాదం,తిర్యాణి సెప్టెంబరు 07:** అడవి పందుల గుంపు ఒక్కసారిగా దాడి చేయడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన తిర్యాణి మండలం రొంపల్లి పంచాయతీ పరిధిలోని రాంచందర్‌గూడలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుడ్మేత దిలీప్ ఉదయం గ్రామ సమీపంలోని చేన్లలో పనికి వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ సంచరిస్తున్న అడవి పందుల గుంపు అతడిపై దాడి చేసింది. దీంతో భయాందోళనకు గురైన దిలీప్ కేకలు వేయడంతో సమీపంలోని గ్రామస్తులు అక్కడికి చేరుకుని పందులను తరిమికొట్టారు. దాడిలో గాయపడిన దిలీప్‌ను చెలిమెల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి రిఫర్ చేశారు. గ్రామ పరిసరాల్లో అడవి పందుల సంచారం పెరిగిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి బెడదను అరికట్టి తమకు రక్షణ కల్పించాలని అధికారులను కోరుతున్నారు.



# ఈవీఎం గోదాము వద్ద నిరంతర పటిష్ట భద్రత

## సీసీ కెమెరాలతో 24 గంటల నిఘా
## కలెక్టర్ కె.హరిత



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 07:** ఈవీఎంలు భద్రపరిచిన గోదాము వద్ద నిరంతర పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. గోదాము పరిసరాలను సీసీ కెమెరాల ద్వారా ఎల్లవేళలా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ కె.హరిత సందర్శించారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం బాక్సులను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గోదాము వద్ద నిరంతరం భద్రతా సిబ్బంది విధుల్లో ఉంటారని, సీసీ కెమెరాల ద్వారా గోదాము పరిసరాలను 24 గంటల పాటు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపునకు 'విద్య ప్లస్'

## అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 07:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు 'విద్య ప్లస్' పైలట్ ప్రాజెక్టును పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తెలిపారు. ఎస్ఐఆర్-2026లో భాగంగా జిల్లాకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు యోగితరాణాకు ప్రాజెక్టుపై సమీక్షా నివేదిక అందజేశారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని గుర్తించి, అవసరాలకు అనుగుణంగా బోధనా విధానాల్లో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. డిజిటల్ పరికరాలు లేని విద్యార్థులకు ప్రింటెడ్ క్యూ.ఆర్/ఆర్కో కార్డులతో మూల్యాంకనం నిర్వహించి, వెబ్‌కామ్ ద్వారా ఫలితాలను తక్షణమే నమోదు చేసే విధానం అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తరగతి గదుల్లో ఏఐ ఆధారిత బోధనా సహాయక వ్యవస్థను వినియోగించి పాఠ్యాంశాల సారాంశాలు, సందేహాల నివృత్తి, వీడియోలు, సిమ్యులేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో ఒకే విధమైన అధ్యయన ప్రణాళికతో అభ్యసన అంతరాలను తగ్గించడంతో పాటు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయి, రోజువారీ బోధనను పర్యవేక్షించేందుకు రియల్‌టైమ్ డాష్‌బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల అకాడమిక్ ప్రతిభ పెంపునకు 'విద్య ప్లస్' దోహదపడుతుందని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 07:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి .చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం యాపల్ ప్రాంతానికి చెందిన గాజుల ఈశ్వరి తన భర్త చనిపోయారని, దినసరి కూలీగా పనిచేస్తూ తన పిల్లలను పోషించుకుంటున్నానని నిరుపేద అయిన తనకు రెండు పడక గదుల ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణం తెలంగాణ నగర్ కు చెందిన బి.కస్తూరి తన ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభానికి ఏర్పాటుచేసిన సపోర్టు వైరు ప్రమాదకరంగా ఉందని, తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన గడ్డం ముకుందర్ రెడ్డి తనకు గల వ్యవసాయ భూమిని ఎల్లంపల్లి ప్రాజెక్టులో రికార్డు నుండి తొలగించారని, రైతుబంధు, రుణమాఫీ రాకపోవడంతో నష్టపోతున్నానని, రికార్డులు సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కల్లు సునీత తాను నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన బిల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం తలమల గ్రామానికి చెందిన పూసం రత్తుబాయి తాను జి.ఎన్.ఎం. పూర్తి చేశానని, చందారం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తల సేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ తమ దరఖాస్తులో ప్రతినెల 1 వేయి యూనిట్ల రక్తం సేకరించే విధంగా జిల్లా స్థాయి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి వార్షిక రక్తదాన క్యాలెండర్ రూపొందించడంతో పాటు ఆరోగ్యశ్రీ పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. మందమర్రి మండలం విద్యానగర్ కు చెందిన మాచర్ల చైతన్య తాను విద్యానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆయాగా విధులు నిర్వహిస్తున్నానని, ఆర్డర్ కాపీ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బోర్‌వెల్‌కు మరమ్మతులు

జననినాదం,తిర్యాణి 07: ఎదులపాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని కుర్సెంగా శ్రీనివాస్ ఇంటి వద్ద బోర్‌వెల్ పనిచేయక స్థానిక కుటుంబాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సోమవారం సర్పంచ్ మడావి పార్వతి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె బోర్‌వెల్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ఆయా కుటుంబాలకు తాగునీటి సమస్య తీరింది. ఈ కార్యక్రమంలో బోర్ మెకానిక్ అర్కా శేఖర్, మడావి నెహ్రూ, బాపూరావు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 07:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంబాజీ నాయక్, మాజీ ఎంపీపీలు అబ్దుల్ కలాం, పెందోర్ మోతిరాం డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పార్టీ శ్రేణులతో కలిసి వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని ప్రకటించి.. 1000 రోజులు గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.మహిళలకు నెలకు రూ.2,500, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, రైతు కూలీలకు నెలకు రూ.12 వేలు, ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు, అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగ జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యాభరోసా, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపు, రైతులకు రైతుభరోసా, కొరత లేకుండా ఎరువుల పంపిణీ, పంటలకు బోనస్, ఉచిత 24 గంటల విద్యుత్, పెంచిన పెన్షన్లు, వివిధ డిక్లరేషన్లను అమలు చేయాలని కోరారు.కార్యక్రమంలో సర్పంచులు కొద్దు, చోలే నాగనాథ్, తుంరం లచ్చు, ఆత్రం ధర్మ, జాటోత్ శారద ఉమేష్, కుర్సెంగ రాధాబాయి దందు, మాజీ ఎంపీటీసీలు ఇఫ్తేకర్ దేశ్‌ముఖ్, శేక్ యునుష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు కుద్బోద్దీన్, మాజీ సర్పంచులు సోము, చౌహాన్ వామన్, నాయకులు కంబాల వినేష్, గుజ్జుల వెంకట్, జాహెద్ ఖాన్, పెందోర్ శ్రీనివాస్, మాచర్ల బాలాజీ, రాంచందర్ గాయక్వాడ్, అనుముల శంకర్, భూత బాపురావు, ఇగురపు సంతోష్, ధనరాజ్, శేక్ పోషన్న, ఆత్రం రాజ్‌కుమార్, సిడం భీంరావు, శేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

**ఆసిఫాబాద్ లో....**

కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు మర్సుకోల సరస్వతితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**జననినాదం,సిర్పూర్(యు) 07:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని



కెరమెరిలో ఎంపిడీవోను వినతిపత్రాలు అందిస్దున్న బిఆర్ఎస్ నాయుకులు



సిర్పూర్(యు),బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన

నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు, మాజీ ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, సర్పంచులు కొమురం భీంరావు, ఆత్రం ఓంప్రకాశ్, సిడం విజయలక్ష్మి, కుర్కుంటే కమల, ఉపసర్పంచ్ ఆత్రం మక్తర్‌సావ్, నాయకులు అర్క నాగోరావు, సలం రాజేష్, పెందోర్ అర్జున్, పెందోర్ శంకర్, కోవా నాందేవ్, మడావి భోజిరావు, తొడసం తిర్మన్‌రావు, మడావి మాన్కు, గొడం అమృత్‌రావు, ఆదిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

## కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ సెప్టెంబర్ 07:** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి , డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి 197 అర్జీలు స్వీకరించారు. మొత్తం అర్జీలు రాగా.. అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 68, కరీంనగర్ నగరపాలక కు29 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని.. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు లాగిన్ లో అప్ డేట్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి సెప్టెంబరు 07:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'సచివాలయ ముట్టడి' కార్యక్రమానికి పిలుపునిచ్చిన బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాలోని కెరమెరి మండలానికి చెందిన బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ విజయ్‌కుమార్, బీసీ మోర్చా జిల్లా నాయకుడు సంగెం వేణు, మండల అధ్యక్షుడు సేడ్మకి తుకారాం, మండల ప్రధాన కార్యదర్శి రంగు శ్రీకాంత్ ఉన్నారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేపడుతుంటే ముందస్తు అరెస్టులతో అడ్డుకోవడం సరికాదన్నారు. పోలీసు బలగాలను వినియోగించి నాయకులను అరెస్టు చేయడంపై చూపుతున్న శ్రద్ధ.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ఎందుకు లేదని ప్రశ్నించారు.ఫీజులు చెల్లించలేక, కళాశాలల నుంచి ధ్రువపత్రాలు పొందలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి రూ.15 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు...**

అరెస్టులు, పోలీసు నిర్బంధాలతో తమ ఉద్యమాన్ని అడ్డుకోలేరని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ప్రస్తుతం కార్యక్రమాన్ని అడ్డుకున్నా.. భవిష్యత్తులో వేలాది మంది విద్యార్థులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. బకాయిలను తక్షణమే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి

## రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా





**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 07:** జిల్లాలో చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి ఎ.ఈ.ఆర్.ఓ.లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్-2026 లో భాగంగా జిల్లాలో 1 లక్షా 70 వేల మ్యాపింగ్ కాని, అనమోలీస్ ఓటర్ల సంబంధిత నోటీసులు జనరేట్ చేయడం జరిగిందని, జనరేట్ చేసిన 1 లక్షా 10 వేల నోటీసులు పంపిణీ చేసి, మిగిలిన 60 వేల నోటీసులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 3 ఈ.ఆర్.ఓ.లు, 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు, అదనంగా కేటాయించబడిన 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు ఎస్ ఐ ఆర్ సంబంధిత క్లెయిమ్స్ ఢ అబ్జెక్షన్ ప్రక్రియపై పని చేస్తున్నారని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని, నోటీసులు జారీ అయిన ప్రతి ఒక్కరు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన 11 డాక్యుమెంట్లలో నుంచి మాత్రమే సంబంధిత ఓటర్లు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు నోటీసుల జారీ, సంబంధిత డాక్యుమెంట్ల సమర్పణ తదితర అంశాలపై మరొకసారి శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నో మ్యాపింగ్, అనమోలీస్, ఎ.ఎస్.డి. జాబితాను సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్లకు అందించాలని, బూత్ స్థాయి అధికారులు నోటీసులు జారీ అయిన ఓటర్లు సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ కూడా ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లతో కలిసి ఎ ఈ ఆర్ ఓ లు, అదనపు ఎ ఈ ఆర్ ఓ లతో ఎస్ ఐ ఆర్- 2026 ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులకు, సూపర్వైజర్ లకు నియమ నిబంధనలపై శిక్షణ నిర్వహించాలని తెలిపారు. నో మ్యాపింగ్, అనమోలీస్, ఎ ఎస్ డి జాబితాను సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని తెలిపారు. ఎస్ ఐ ఆర్ కు ప్రతిరోజు కొంత సమయం ప్రత్యేకంగా కేటాయించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కమ్యూనిటీ సర్టిఫికెట్ నిబంధనలను అనుసరించి త్వరితగతిన జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అంతకుముందు జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల సింగరేణి అతిథి గృహానికి చేరుకున్న విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా ను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం నస్పూర్ లో గల 250, 251, 252, 253 పోలింగ్ కేంద్రాలను సందర్శించి సంబంధిత బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గుండాలకు రోడ్డు వేయరా..?

**తరాలు మారుతున్నా.. మా తలరాతలు మారడం లేదు**

**సర్పంచ్ దౌలత్ ఆధ్వర్యంలో గిరిజనుల వినూత్న నిరసన..**

**గుండాల నుంచి జిల్లా కేంద్రానికి పాదయాత్ర**

**కలెక్టర్ కార్యాలయం ఎదుట శాంతియుత ఆందోళన..**

**మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్**

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 07:** తిర్యాణి మండలంలోని గుండాల గ్రామానికి కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తూ గిరిజనులు వినూత్న నిరసనకు దిగారు. స్థానిక సర్పంచ్ అడ సోము ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులు గుండాల నుంచి జిల్లా కేంద్రానికి పాదయాత్రగా తరలివచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన చేపట్టి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడంతో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

వర్షాకాలం వచ్చిందంటే నరకమే..గుండాల గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని గ్రామస్తులు తెలిపారు. గుట్టపైకి బండరాళ్లు, బురద మధ్య ప్రయాణిస్తూ నరకయాతన అనుభవిస్తున్నామని వాపోయారు. గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేక ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి నెలకొందన్నారు. అత్యవసర సమయంలో వైద్యం కోసం వెళ్లాలన్నా, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా ఎన్నో అవస్థలు పడుతున్నామని తెలిపారు..

**ఏళ్లుగా ఎదురుచూపులే....**

తరాలు మారుతున్నా తమ తలరాతలు మాత్రం మారడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా గుండాల గ్రామంలో నివసిస్తున్నప్పటికీ ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు అందలేదన్నారు. రోడ్డు, రవాణా తదితర సౌకర్యాలు లేక విద్యార్థులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాలు కురిసిన



సమయంలో గ్రామం నుంచి బయటకు రావడమే కష్టంగా మారుతోందన్నారు....

**పాలకులున్నా పట్టించుకునే వారే లేరు...**

తమ ప్రాంతానికి చెందిన గిరిజన నాయకులే పాలకులుగా కొనసాగుతున్నప్పటికీ గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. అధికారులు సైతం గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**కలెక్టర్ స్పందించాలి...**

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి గుండాల గ్రామానికి తక్షణమే రహదారి సౌకర్యంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ దౌలత్, గ్రామస్తులు కోరారు. తమ సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో దౌలత్ రావు,తదితరులు పాల్గొన్నారు

# సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం

**జననినాదం,సిర్పూర్ (యు) 07:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ గంగారం అన్నారు. సిర్పూర్ మండల కేంద్రంలో సోమవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, అనుమానాస్పద లింకుల ద్వారా జరిగే మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించరాదని, అనుమానాస్పద లింకులు, యాప్‌లను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, బీఆర్ఎస్ మండల



అధ్యక్షుడు తొడసం ధర్మారావు, మాజీ ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, సర్పంచులు కొమురం భీంరావు, ఆత్రం ఓంప్రకాశ్, సిడం విజయలక్ష్మి, కుర్కుంటే కమల, ఉపసర్పంచ్ ఆత్రం మక్తర్‌సావ్, నాయకులు అర్క నాగోరావు, సలం రాజేష్, పెందోర్ అర్జున్, పెందోర్ శంకర్, కోవా నాందేవ్, మడావి భోజిరావు, తొడసం తిర్మన్‌రావు, మడావి మాన్కు, గొడం అమృత్‌రావు, ఆదిల్, తదితరులు పాల్గొన్నారు.

# జైనూర్‌లో సదరం క్యాంప్ ఏర్పాటు చేయాలని వినతి




**జననినాదం, జైనూర్ 07:** జైనూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో సదరం క్యాంప్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివాసి మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు, చెవిటి, మూగ, అంగవైకల్యం ఉన్నవారితో పాటు సికిల్‌సెల్, తలసేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో నిర్వహించే సదరం క్యాంపులకు మారుమూల ప్రాంతాల గిరిజనులు వెళ్లడం, ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం వంటి ప్రక్రియల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సదరం ధ్రువపత్రం లేకపోవడంతో అర్హులైన కొందరు దివ్యాంగుల పింఛన్‌తో పాటు ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరమవుతున్నారని తెలిపారు. జైనూర్ సీహెచ్‌సీలో సదరం క్యాంప్ ఏర్పాటు చేయాలని గతంలోనూ జిల్లా కలెక్టర్‌కు మూడుసార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు వెల్లడించారు. జైనూర్‌లో క్యాంప్ ఏర్పాటు చేస్తే కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు సదరం ధ్రువపత్రాలు పొందేందుకు సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జైనూర్ సీహెచ్‌సీలో సదరం క్యాంప్ ఏర్పాటు చేయాలని కోరారు.

# విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

**భీమిని మండల విద్యాధికారి వెంకటస్వామి**

**ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**



**జననినాదం,బెల్లంపల్లి 07:** విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని భీమిని మండల విద్యాధికారి వెంకటస్వామి అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం భీమినిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఐ.విజయ (భీమిని), ఎం.లావణ్య (వెంకటాపూర్), డి.సుదర్శన్ (మల్లిడి ఎస్సీ కాలనీ), ఎస్.మల్లేష్ (భీమిని), శైలజ (భీమిని), ఏ.మౌనిక (వీగాం)లను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులంతా కలిసి ఎంఈవో వెంకటస్వామిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

# గిరిజన విద్యార్థులకు సకల సౌకర్యాలు

**డీడీ జాదవ్ అంబాజీ .... 220 మంది విద్యార్థులకు యూనిఫాంలా పంపిణీ**



**జననినాదం,కాగజ్ నగర్ 07:** గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ తెలిపారు. కాగజ్‌నగర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాల బాలురను సోమవారం ఆయన సందర్శించి డీఆర్‌డీఏ ఏపీడీ బానోత్ దత్తారంతో కలిసి 220 మంది విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 46 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఒక్కొక్క విద్యార్థికి ఒక జత యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో సుమారు 9,200 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధితోపాటు ఆరోగ్యం, వసతి, భోజనం, దుస్తుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగులకు బదిలీలు సహజమే

**పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్**

**బదిలీపై వెళ్తున్న సెక్రటరీకి సన్మానం**



**జననినాదం,తిర్యాణి 07:** ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమేనని, అయితే పనిచేసిన ప్రాంత ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవడం గొప్ప విషయమని పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ అన్నారు. తిర్యాణి పీఏసీఎస్‌లో సెక్రటరీగా విధులు నిర్వహించి ఆసిఫాబాద్‌కు బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వర్‌గౌడ్‌ను సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ కాలంలోనే వెంకటేశ్వర్‌గౌడ్ తన పనితీరు, సేవాభావంతో రైతులు, ఖాతాదారుల నమ్మకాన్ని పొందారని తెలిపారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు చొరవ చూపారని కొనియాడారు. బదిలీపై ఎక్కడ పనిచేసినా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఆకాంక్షించారు. తిర్యాణిలో విధులు నిర్వహించిన సమయంలో ప్రజలు, రైతులు, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమ్ పటేల్, ఉపసర్పంచ్ సరిత, పీఏసీఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహించాలి.

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.**



**జయశంకర్ భూపాలపల్లి. సెప్టెంబర్ 07:** వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతిని పూజిద్దాం ... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే వాల్ పోస్టర్లు, మట్టి గణపతుల ఉచిత పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా ఉత్సవాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 2 వేలు మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు, రసాయనిక రంగుల వినియోగం వల్ల విగ్రహాల నిమజ్జనం సమయంలో నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రసాయనాలు, రంగులు నీటిలో కలవడం వల్ల జలచరాలు చనిపోవడంతో నీటి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ప్రకృతి సిద్ధమైన మట్టితో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి అనుకూలమని, వాటిని ఉపయోగించడం ద్వారా నీటి వనరుల పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ అన్నారు. పండుగలు మన సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతీకలని, అదే సమయంలో ప్రకృతి పరిరక్షణకు కూడా ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులు, కుంటలు, నదులు తదితర నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మట్టి గణపతిని పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే సందేశాన్ని ప్రతి కుటుంబం పాటించి పర్యావరణహిత వినాయక చవితి నిర్వహణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల ఏర్పాటుపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, కాలుష్య నియంత్రణ మండలిఏఈఎస్ శ్రీకాంత్, జిల్లా సైన్స్ అధికారి స్వామి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హియరింగ్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి

**అర్హుల పేర్లు తొలగకుండా.. అనర్హులకు**

**చోటులేకుండా ఎస్ఐఆర్**

**11 రకాల ధ్రువపత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలి**

**ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీల కురాలు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 07:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్మ చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్‌రావుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో హియరింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీల కురాలు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శిడా. యోగితా రాణా మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్కరి పేరు ఓటరు జాబితా నుంచి తొలగకుండా.. అనర్హుల పేర్లు జాబితాలో లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని తెలిపారు. హియరింగ్‌కు నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా భారత ఎన్నికల సంఘం ఆమోదించిన 11 రకాల ధ్రువపత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర దేశాల్లో ఉన్న ఓటర్ల తరఫున వారి కుటుంబ సభ్యులు ధ్రువపత్రాలను సమర్పించే అవకాశం ఉందని చెప్పారు. ఎన్నికల సంఘం ఆమోదించిన 11 రకాల ధ్రువపత్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. తమ బూత్ స్థాయి ఏజెంట్లను హియరింగ్ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని కోరారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియ సజావుగా జరిగేలా సహకరించాలని తెలిపారు.

**పకడ్బందీగా హియరింగ్...**

కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ జిల్లాలో హియరింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. హియరింగ్ ప్రదేశం, తేదీ వివరాలను బూత్ స్థాయి అధికారుల ద్వారా ముందుగానే తెలియజేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో చాటింపు ద్వారా కూడా ప్రజలకు సమాచారం అందిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ఒక్కరి పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# వైద్యశాలకు షెడ్డు నిర్మాణం అభినందనీయం

**సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తుంరం గోపాల్**

**షెడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ**



**జననినాదం,తిర్యాణి 07:** పంగిడి మదరపల్లె ప్రభుత్వ వైద్యశాలలో రేకుల షెడ్డు నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు చొరవ తీసుకోవడం అభినందనీయమని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తుంరం గోపాల్ అన్నారు. సోమవారం షెడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవల్లో ఇబ్బందులు లేకుండా షెడ్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంగిడి మాధర సర్పంచ్ ఆత్రం రాధా, వివిధ గ్రామాల పటేళ్లు పేందురు డొంగురు, ఆత్రం చందు, ఎంఎల్‌హెచ్‌పీలు లతసిరి, లొద్దిగూడ మాజీ సర్పంచ్ చిరంజీవి, ఆత్రం తెలంగారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 07:** వానాకాలం 2026-27 సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కొరకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి జిల్లా గిరిజన అభివృద్ధి సంస్థ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మెప్మా, డి సి ఎం ఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2026- 27 కు సంబంధించి జిల్లాలో అవసరమైన గోదాము లను గుర్తించి సిద్ధం చేయాలని, సంబంధిత ఏజెన్సీ లతో సన్నాహక సమావేశాలు నిర్వహించి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎత్తైన ప్రదేశాలలో చదునుగా ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేసేలా చూడాలని, జిల్లాలో అక్టోబర్ 1వ తేదీ నాటికి సంబంధిత ఏజెన్సీలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు సమకూర్చుకొని సిద్ధంగా ఉండాలని, అక్టోబర్ 1వ తేదీలోగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పి సి ఎస్ ఎ పి అప్లికేషన్ లో 16 ప్రశ్నలకు రియల్ టైం ఫొటోస్ నమోదు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల రీ కన్ఫేషన్ త్వరితగతిన పూర్తి చేయించాలని, వానాకాలం సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆన్ లైన్ ప్రకారం ట్రక్ షీట్స్ జనరేషన్, గోనె సంచుల నిర్వహణ, లారీలకు జియో టాగింగ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టేలా అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...

**- జాతీయ రహదారిపై రాస్తారోకో**



**ములుగు ప్రతినిది07:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలకేంద్రంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఏటూరునాగారం బస్టాండ్ నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఐటీడీఏ ఎదురుగా జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులకు విద్యా, ఉద్యోగాల్లో తీవ్ర జాప్యం చేస్తున్నాయని ఆరోపించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు ఉద్యోగాలు కల్పించాలని, ఏజెన్సీ డీఎస్సీ ద్వారా ఏజెన్సీ సర్టిఫికెట్ ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏటూరునాగారం ఐటీడిఏ పీవో కి అందజేశారు. 1976 నుండి 50 ఏళ్లుగా రాజ్యాంగ సవరణ లేకుండా ఎస్టీ జాబితాలోకి వచ్చి లంబాడీలు రిజర్వేషన్లు పొందుతున్నారని, వారిని ఎస్టీ జాబితా నుండి తొలగించాలని, ఇందుకోసం జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలను సిద్దిపేట, సిరిసిల్ల, మహబూబ్ నగర్ తదితర జిల్లాలకు తరలిస్తున్నారని, స్థానిక ఏజెన్సీ మండలాలకు చుక్క నీరు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఐటీడీఏ ద్వారానే పరిపాలన కొనసాగించాలని, లేనియెడల లక్షలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో గిరిజనులు, తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముందు బీసీ ఎస్ సి ఎస్ టి జే ఏ సి ఆధ్వర్యంలో ధర్నా



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 07:** రూ. 14,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని జే ఏ సి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రాష్ట్రంలో నిలిచిపోయిన రూ. 14,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ ఆందోళన కార్యక్రమానికి విద్యార్థులు ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జే ఏ సి జిల్లా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం దుర్మార్గమన్నారు ఫీజులు చెల్లించలేక సర్టిఫికేట్లు అందక అనేకమంది విద్యార్థులు చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ అధికారుల ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షులు మంచర్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు, ఓటర్ జాబితా తయారులో జవాబుదారితనంతో పని చేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి,సెప్టెంబర్ 07:** ఎన్నికల విధులు, ఓటర్ల జాబితా నిర్వహణలో జవాబుదారీతనంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుండి సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, అనామలిస్ ఓటర్లుకు నోటీసులు జారీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులు, ఆర్డీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న డేటా ఆపరేటర్ల పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్, ఈఆర్వో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఈఆర్వోలు అధికారిక ఫోన్ నంబర్లతో నేరుగా స్పందించాలని, ఎన్నికల సంబంధిత కమ్యూనికేషన్‌లో ఎలాంటి లోపాలకు తావివ్వరాదని ఆదేశించారు. బిఎల్వోఓలు సమర్పించే పత్రాలను సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే సిస్టమ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఈఓ సూచించారు. తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం అప్ లోడ్ చేయకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలిస్, మ్యాపింగ్ వివరాలను సంబంధిత ఈఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి వెబ్‌సైట్లలో పారదర్శకంగా వెల్లడించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో నోటీసుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 32,636 నోటీసులు జనరేట్ చేసినట్లు పేర్కొన్నారు.నోటీసుల పంపిణీ ప్రారంభ దశలో కొంత మందకొడిగా సాగినప్పటికీ ప్రస్తుతం వేగం పుంజుకుందని, ఒక్కరోజులో సుమారు 2,600 నోటీసులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా పంపిణీ చేయాల్సిన 21,894 నోటీసులను రాబోయే మూడు రోజుల్లో పూర్తిగా పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. నోటీసుల పంపిణీలో ఎలాంటి పెండింగ్ లేకుండా ప్రతి నోటీసు సంబంధిత వ్యక్తులకు చేరేలా తహాశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రతిరోజూ నోటీసులు పంపిణీ పురోగతిపై సమీక్ష నిర్వహిస్తూ, మిగిలిన నోటీసుల వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల సంబంధిత ప్రతి ప్రక్రియలో అధికారులు పారదర్శకత, ఖచ్చితత్వం, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, భూపాలపల్లి తహసీల్దార్ లక్ష్మి.రాజయ్య, డిటి అబ్బాస్, ఈడీఎం శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో 'ప్రణామ్' వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం



**జయశంకర్ భూపాలపల్లి,సెప్టెంబర్ 07:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో, మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన ప్రణామ్' వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను భూపాలపల్లి శాసనసభ్యులు సత్యనారాయణ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ రావు మాట్లాడుతూ, వయోవృద్ధులు సమాజానికి అందించిన సేవలు, వారి అనుభవం ఎంతో విలువైనవని అన్నారు. వృద్ధాప్యంలో వారికి ఆరోగ్య సంరక్షణతో పాటు ఆప్యాయత, భద్రత, గౌరవం, మానసిక ప్రశాంతత అవసరమని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఈ డే కేర్ సెంటర్‌ను మరింత అభివృద్ధి చేసి, వారికి అన్ని విధాలా ఉపయోగపడేలా నిర్వహించాలని సూచించారు. రెడ్ క్రాస్ భవన నిర్మాణాన్ని అతి త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అదే భవనంలో వయోవృద్ధుల కోసం ప్రత్యేకంగా ఒక సౌకర్యవంతమైన భవనాన్ని ఏర్పాటు చేయాలని, వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రెడ్ క్రాస్ సేవా సంస్థకు ప్రత్యేక గుర్తింపుగా లిలిరెడ్ క్రాస్ గుర్తు (మార్క్) స్పష్టంగా ఉండేలా భవనాన్ని ఏర్పాటు చేయాలనిసూచించారు.అలాగే, ప్రణమ్ డే కేర్ సెంటర్‌ను కేవలం భవనంగా కాకుండా వయోవృద్ధులకు నిజమైన సేవా కేంద్రంగా తీర్చిదిద్దాలని, నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా, పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సత్యనారాయణ రావు సూచించారు. వయోవృద్ధులు తమ సమయాన్ని ఆనందంగా గడిపేలా ఆరోగ్యం, వినోదం, పరస్పర స్నేహభావం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ, వయోవృద్ధుల సంక్షేమానికి శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. వృద్ధులు ఒంటరితనానికి గురికాకుండా, ఆహ్లాదకరమైన వాతావరణంలో తమ సమయాన్ని గడిపేలా డే కేర్ సెంటర్ ఉపయోగపడుతుందని అన్నారు. వయోవృద్ధుల ఆరోగ్యం, సంక్షేమం, భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, వయోవృద్ధుల కోసం ఇలాంటి ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వృద్ధులను గౌరవించడం, వారి అవసరాలను గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కేంద్రం అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు.రెడ్ క్రాస్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ, వయోవృద్ధుల సేవే నిజమైన మానవ సేవ అని అన్నారు. వారి ఆరోగ్యం, ఆనందం, మానసిక ఉల్లాసం కోసం లి'ప్రణమ్' డే కేర్ సెంటర్‌ను రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందనిలి తెలిపారు. వయోవృద్ధులకు అవసరమైన సేవలను నిరంతరం అందిస్తూ, కేంద్రాన్ని సక్రమంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అతిథులు డే కేర్ సెంటర్‌లోని సదుపాయాలను పరిశీలించి, వయోవృద్ధులతో ముచ్చటించారు. వారి అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# ప్రజావాణిలో 19 దరఖాస్తులు.. సత్వర పరిష్కారానికి కమిషనర్ ఆదేశాలు



**కరీంనగర్ సెప్టెంబర్ 07:** కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 19 దరఖాస్తులు అందాయి. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగానికి 9, టౌన్ ప్లానింగ్‌కు 4, రెవెన్యూకు 4, సానిటేషన్‌కు 1, ఇందిరమ్మకు 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. అభివృద్ధి పనులు, ఆక్రమణల తొలగింపు, అక్రమ నిర్మాణాలు, పన్నుల సవరణ, కొత్త ప్రాపర్టీలు, పారిశుధ్య సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని, ఎలాంటి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచవద్దని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆయాజ్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, డీసీపీ బషీరొద్దీన్, ఏసీపీ వేణు, ఇన్‌చార్జి ఈఈ లచ్చిరెడ్డి, సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా పల్లకి మహోత్సవం

**ఊరేగింపులో శ్రీ నరసింహ స్వామి నామస్మరణం మారు మ్రోగింది**

**పల్లకి మహోత్సవం తొ ముగిసిన శ్రావణమాసం ఉత్సవాలు**

**విద్యుత్ దీపాలు ప్రజలను ఆకర్శించాయి**

**మండల గ్రామ ప్రజలు సహకరించాలి**

**డిప్యూటీ కమిషనర్ వాణి**

**కౌతాళం 07:** ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన లక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకి మహోత్సవం చివరి సోమవారం శ్రావణమాసం సందర్భంగా అంగరంగ వైభవంగా పల్లకి మహోత్సవం దేవాలయ డిప్యూటీ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు అర్చకులు పోలీస్ సిబ్బంది నిర్వహించరు. పూజలు అనంతరం స్వామివారికి తుంగభద్ర నది జలాలతో జలాభిషేకం కోసం కందుకూరు గ్రామానికి చేరుకున్నారు.. అక్కడ వేద పండితుల ఆధ్వర్యంలో తుంగభద్ర నదిలో అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు భక్తుల సమక్షంలో నిర్వహించరు. కందుకూరు నుండి తిప్పల దొడ్డి, కరణి, మల్లన హట్టి చిరుతపల్లి గ్రామాలలో పల్లకి ప్రవేశించి ఉరుకుంద గ్రామానికి సాయంత్రం 7 గంటల సమయంలో. దేవాలయ అధికారులు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో భాజా భజంత్రీలతో మేళతాళలతో స్వాగతం పలికి ఊరేగింపుగా దారి పొడవునా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇక్కడ వేలాది మంది భక్తులు పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం స్వామి వారు దేవాలయంలో ప్రవేశించి గాని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుకుంద నామస్మరణం మారుమ్రోగింది.. పల్లకి మహోత్సవానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఆలయ అధికారులు, విద్యుత్ అధికారులు అంతరాయం కలగకుండా చర్యలు మరియు సిబ్బంది సీఐ యుగంధర్ మరియు పోలీస్ సిబ్బంది సౌకర్యాలను కల్పించారు.

# మణుగూరులో 'గ్యాంగ్' గర్జనకు బ్రేకులు ఎప్పుడు..!

**గంజాయి.. డ్రగ్స్.. రాష్ డ్రైవింగ్‌పై ఉక్కుపాదం మోపాలి**

**మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేయాలి**

**శివ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి**


**ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు వినతిపత్రం**

**అందజేసిన మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 07:** మణుగూరు పట్టణంలో కొంతకాలంగా యువకులు గ్యాంగులుగా సంచరిస్తున్నారనే ఆరోపణలు, గంజాయి--మాదకద్రవ్యాల వినియోగంపై వస్తున్న ఫిర్యాదులు, రాష్ డ్రైవింగ్‌తో మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆందోళనల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల మణుగూరులో యువకుడు శివ మృతి చెందిన ఘటన ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలికితీసేందుకు సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఎవరైనా బాధ్యులుగా తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కాలేజీలు వదిలే వేళ.. రోడ్లపై 'రేస్'లా..ముఖ్యంగా సాయంత్రం 4 గంటల సమయంలో కాలేజీలు వదిలే వేళ, కొంతమంది యువకులు ద్విచక్ర వాహనాలపై ముగ్గురు, నలుగురు కలిసి ప్రయాణిస్తూ రాష్ డ్రైవింగ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని దుర్గ తెలిపారు. దీంతో మహిళలు, విద్యార్థినులు రోడ్లపై ప్రయాణించేందుకు భయపడే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు."టూ వీలర్ చలాన్లపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా గంజాయి, డ్రగ్స్, గ్యాంగ్ కార్యకలాపాలు, రాష్ డ్రైవింగ్, మహిళల భద్రతపై చూపాలి" అని ఆమె పోలీసు అధికారులను కోరారు.యాంటీ డ్రగ్' టీమ్‌లు రంగంలోకి రావాలి.మణుగూరు పట్టణంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, సరఫరాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అవసరమైతే ప్రత్యేక యాంటీ-డ్రగ్ పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని దుర్గ డిమాండ్ చేశారు.అదేవిధంగా గ్యాంగులుగా తిరుగుతున్న యువకుల కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక పోలీసు టీమ్‌లను ఏర్పాటు చేసి, కాలేజీలు, విద్యార్థినులు, మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో పోలీసు గస్తీని పెంచాలని కోరారు.పోలీసు పోస్టింగులపైనా సమీక్ష అవసరం ఒకే ప్రాంతంలో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది పోస్టింగులను నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు సమీక్షించాలని ఆమె సూచించారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా అధికారులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. "మణుగూరులో 'గ్యాంగ్' అనే భయపెట్టే సంస్కృతికి పూర్తిగా అడ్డుకట్ట వేయాలి. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి భయం లేకుండా రోడ్లపై తిరిగే పరిస్థితి కల్పించాలి. ప్రజల భద్రత విషయంలో ఇకపై నిర్లక్ష్యానికి తావుండకూడదు. గంజాయి, డ్రగ్స్, రాష్ డ్రైవింగ్, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి" అని పాల్వంచ దుర్గ స్పష్టం చేశారు.

# కొడుకులు తనను పట్టించుకోవడంలేదని ప్రజావాణి లో వృద్ధురాలి దరఖాస్తు



**మెట్ పల్లి, సెప్టెంబర్ 7:** కొడుకులు తనను పట్టించుకోవడం లేదంటూ సోమవారం వృద్దురాలు ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చి అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ పరిధిలోని ఆరపేటకు చెందిన చౌటుపల్లి సత్తమ్మ తనకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్న పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.సత్తమ్మ భర్త మూడు సంవత్సరాల క్రితం మృతి చెందారు. ఇద్దరు కుమారులు వివాహం అనంతరం వేరువేరుగా నివసిస్తున్నారు. వారసత్వంగా వచ్చిన ఆరు ఎకరాల భూమిని కుమారులకు చెరి సగం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. తన పేరుపై ఉన్న మరో రెండు ఎకరాల పదిహేను గుంటల భూమిని కూడా కుమారులు తమ పేర్లపైకి మార్చుకున్నారని వాపోయారు. భూమిని తమ పేర్లపైకి మార్చే సమయంలో తనకు చెరో లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తామని, నెలనెలా నిత్యావసర సరుకులు అందిస్తామని కుమారులు హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు డబ్బులు డిపాజిట్ చేయకపోవడంతో పాటు సరుకులు కూడా అందించడం లేదని సత్తమ్మ పేర్కొన్నారు. ప్రస్తుతం తాను ఒంటరిగా ఉంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. ఈ విషయమై ఆమె తన కుమారులను ప్రశ్నించగా, తనపై దాడి చేసి కొట్టారని ఆమె ఆరోపించారు. దీంతో ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తన పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తనను ఆదుకునేలా, కుమారులు తన పోషణ బాధ్యత తీసుకునేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని అధికారులను సత్తమ్మ వేడుకున్నారు.

# కోర్టు కేసులపై సమగ్ర సమీక్ష



**గోదావరిఖని07:** రామగుండం ఏరియా--1లో కోర్టు కేసులపై సమగ్ర సమీక్ష రామగుండం ఏరియా--1 జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సింగరేణి సంస్థకు సంబంధించిన కోర్టు కేసులపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి లా డిపార్ట్‌మెంట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఆర్.జి--1 ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ కె. చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా లా డిపార్ట్‌మెంట్ ఏజీఎం అరవింద్ రావు ఇంచార్జి జీఎం కె. చంద్రశేఖర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.ఈ సమావేశంలో సింగరేణి సంస్థకు సంబంధించిన వివిధ కోర్టు కేసుల ప్రస్తుత స్థితి, కేసుల పురోగతి, తదుపరి న్యాయపరమైన చర్యలు, కేసులకు సంబంధించిన రికార్డులు, డేటా నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ఆయా కేసుల్లో అవసరమైన చర్యలను సకాలంలో చేపట్టాలని అధికారులకు సూచించారు.కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు, సంబంధిత విభాగాల అధికారులు మరియు లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. సంస్థకు సంబంధించిన న్యాయపరమైన అంశాల్లో అవసరమైన పత్రాలు, రికార్డులు, వాస్తవ వివరాలను సకాలంలో న్యాయ విభాగానికి అందించడం ద్వారా కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని తెలిపారు.అలాగే కోర్టు కేసుల విషయంలో ప్రతి కేసు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, తదుపరి విచారణ తేదీలు, కోర్టు ఆదేశాలు, అవసరమైన చర్యలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని సూచించారు. సంస్థ ప్రయోజనాలను పరిరక్షించే విధంగా న్యాయపరమైన చర్యలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఇన్‌చార్జి జీఎం పేర్కొన్నారు.ఈ సమావేశంలో శ్రీమతి అఫ్రిన్ సుల్తాన, సీనియర్ లా ఆఫీసర్, ఆర్జీ రీజియన్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, మెండే మల్లేష్, డిప్యూటి లా మేనేజర్ బెల్లంపల్లి రీజియన్ ఆలాగే ఈ కార్యక్రమములో ఆర్.జి--1, ఆర్.జి--2, ఆర్.జి--3, భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాలకు చెందిన లా అధికారులు, సీనియర్ పర్సనల్ అధికారులు, ఎస్టేట్ అధికారులు, సర్వే అధికారులు, కేస్ ఆఫీసర్లు తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అంకిరెడ్డి పల్లె గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

## భారీగా పోలీసు బందోబస్తు...

కొలిమిగుండ్ల సెప్టెంబర్ 07: కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డి పల్లె గ్రామంలో టిడిపి నాయకుడు జయరామిరెడ్డి, వడ్డే మహేష్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువురు పాత కక్షలు నేపథ్యంలో ముందుగా ఒకరినొకరు దూషించుకున్నారు. అనంతరం జయరామిరెడ్డి వడ్డే మహేష్ పై వేట కొడవలితో దాడి చేయగా మహేష్ కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ బాధితుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామంలో ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460